# వసతిగృహాల్లో పనిచేయని ప్యూరిఫయర్లు

## విద్యార్థులకు అందని శుద్ధ జలాలు

లింగంపేట, డిసెంబర్15: విద్యార్థులకు స్వచ్ఛమైన తాగు నీరు అందించడానికి గత ప్రభుత్వం వసతి గృహాల్లో వేలాది రూపాయలు వెచ్చించి ప్యూరిఫయర్లు ఏర్పాటు చేశారు. ప్రభుత్వం ఏర్పాటు చేయించిన ప్యూరిఫయర్ల నిర్వహణపై అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో అవి మూలకు పడ్డాయి. చెడిపోయిన ప్యూరిఫయర్లకు మరమ్మతులు చేయించడంపై అధికారులు దృష్టి సారించడం లేదు. దీంతో విద్యార్థులకు తాగునీరు అందడం కష్టంగా మారింది. మండల కేంద్రంలోని బీసీ, ఎస్సీ బాలుర వసతి గృహాల్లో రెండు సంవత్సరాల క్రితం అప్పటి ప్రభుత్వం ప్యూరిఫయర్లను ఏర్పాటు చేయించింది. కలుషిత నీరు తాగడంతో విద్యార్థులు అస్వస్థతకు గురయ్యే అవకాశాలు ఉన్నందున ప్రభుత్వం ఈ చర్యలను చేపట్టింది. ప్రభుత్వం ఏర్పాటు చేయించినా.. వాటి నిర్వహణపై అధికారులు శ్రద్ధ చూపలేదు. దీంతో అవి ప్రస్తుతం మూలన పడ్డాయి. ప్యూరిఫయర్లు చెడిపోయి నెలలు గడుస్తున్నా వాటి మరమ్మతులు చేయించడంపై దృష్టి సారించడం లేదు. ప్రస్తుతం అవి మూలన పడి ఉండగా.. నిత్యం మినరల్ వాటర్ కొనుగోలు చేస్తున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలోని పలు వసతి గృహాల్లో విద్యార్థులు అస్వస్థతకు గురై దవాఖానల పాలవుతున్నారు. అందుకు కలుషిత నీరు తాగడం కూడా ఒక కారణం. అయినా అధికారులు ప్యూరిఫయర్ల మరమ్మతుపై దృష్టి సారించకపోవడం విడ్డూరంగా ఉన్నది. లింగంపేటలోని ఎస్సీ, బీసీ బాలుర వసతి గృహాల్లో వందకు పైగా విద్యార్థులకు ఉంటున్నారు. నిత్యం రెండు పూటల విద్యార్థులకు తాగు నీరు కొనుగోలు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఉన్నవాటిని వదిలేసి ప్రతిరోజూ నీళ్లను కొనడం ఏమిటని పలువురు విస్మయం వ్యక్తంచేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి వాటిని బాగుచేయించాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది.



లింగంపేటలోని ఎస్సీ వసతి గృహంలో పనిచేయని ప్యూరిఫైర్



బీసీ బాలుర వసతి గృహంలో..

### 15 రోజుల్లో మరమ్మతు చేయిస్తాం..

జిల్లాలోని సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో చెడిపోయిన ప్యూరిఫయర్లకు 15 రోజుల్లో మరమ్మతులు చేయిస్తాం. ప్రస్తుతం వసతి గృహాల్లో ఉంటున్న విద్యార్థులకు తాగు నీటిని కొనుగోలు చేసి అందిస్తున్నాం. కొన్ని వసతి గృహాల్లో ప్యూరిఫయర్లు చెడిపోగా.. కొన్ని బాగున్నాయి. విద్యార్థులకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకుంటున్నాం. నిధుల కొరతతో మరమ్మతు చేయించడంలో ఆలస్యం జరిగింది. వార్డెన్లకు వచ్చిన నిధులు నుంచి మినరల్ వాటర్ కొనుగోలు చేస్తున్నాం.

**- రజిత, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారిణి**

## నాణ్యతా ప్రమాణాలు పాటించాలి




దవాఖాన భవన నిర్మాణ పనులను పరిశీలిస్తున్న పోచారం

బాన్సువాడ, డిసెంబర్ 15: పనులు నాణ్యతా ప్రమాణాలతో చేపట్టాలని, త్వరగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి కాంట్రాక్టర్‌కు సూచించారు. పట్టణంలో రూ.37 కోట్ల 50 లక్షలతో నూతనంగా నిర్మిస్తున్న వంద పడకల ప్రభుత్వ ఏరియా దవాఖాన భవన నిర్మాణ పనులను ఆయన ఆదివారం పరిశీలించారు. భవన నిర్మాణ మ్యాప్‌ను పరిశీలించారు. ఆయనవెంట పలువురు నాయకులు ఉన్నారు.

## కార్యకర్తలకు అండగా బీఆర్ఎస్

- కామారెడ్డి మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్
- బాధిత కుటుంబాలకు బీమా చెక్కుల అందజేత

మాచారెడ్డి/ కామారెడ్డి, డిసెంబర్ 15: బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటుందని మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ అన్నారు. మాచారెడ్డి మండలంలోని లచ్చాపేట గ్రామానికి చెందిన కైరంకొండ శివరాములు, జక్కుల శివరాములు ప్రమాదవశాత్తు మరణించారు. వీరికి బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వంతోపాటు ప్రమాద బీమా కార్యకర్తల పేరుపై ఉండడంతో రూ.రెండులక్షల ఇన్సూరెన్స్ మంజూరైంది. ఇందుకు సంబంధించిన చెక్కులను వారి కుటుంబ సభ్యులకు మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ ఆదివారం కామారెడ్డిలో అందజేశారు. ఆ కుటుంబాలకు పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ మినుకూరి రాంరెడ్డి, నల్లవెల్లి అశోక్, లక్ష్మీ నారాయణ, లచ్చాపేట మాజీ ఎంపీటీసీ బూస శ్రీనివాస్, లద్దూరి కృష్ణయాదవ్, దినేశ్ తదితరులు పాల్గొన్నారు.



బీమా చెక్కును అందజేస్తున్న కామారెడ్డి మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్

## జాతీయ స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపిక



షానవాజ్

లింగంపేట, డిసెంబర్15: లింగంపేట మండల కేంద్రానికి చెందిన షానవాజ్ జాతీయ స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికయ్యాడు. డిచ్‌పల్లిలో ఇటీవల నిర్వహించిన తెలంగాణ యూనివర్సిటీ స్థాయి క్రీడల్లో ప్రతిభ కనబరిచారు. ఈనెల 18 నుంచి 23వ తేదీ వరకు కేరళ రాష్ట్రంలో నిర్వహించే సౌత్ జోన్ క్రీడల్లో యూనివర్సిటీ నుంచి ప్రాతినిధ్యం వహించనున్నాడు. జాతీయ స్థాయి క్రీడలకు ఎంపికవవడంపై స్థానికులు హర్షం వ్యక్తంచేస్తున్నారు.

## అండర్-14 క్రికెట్ పోటీలకు కార్తికేయ

కామారెడ్డి, డిసెంబర్ 15: హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ అండర్-14 క్రికెట్ పోటీలకు ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని కామారెడ్డికి చెందిన దర్శణం కార్తికేయ ఎంపికయ్యాడు. నిజామాబాద్‌లో నిర్వహించిన క్రికెట్ ఎంపిక పోటీల్లో కార్తికేయ ఉత్తమ ప్రదర్శన ఇవ్వడంతో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. కార్తికేయ కామారెడ్డిలోని ఆర్‌సీసీఏ అకాడమీలో మహ్మద్ ఖాజా రియాజుద్దీన్ వద్ద శిక్షణ తీసుకుంటున్నాడు. అతడిని తల్లిదండ్రులు, బంధువులు, స్నేహితులు అభినందించారు.



కోచ్ రియాజుద్దీన్‌తో కార్తికేయ

## సమయానికి రాని బస్సులు.. ప్రయాణికులకు తిప్పలు

లింగంపేట, డిసెంబర్ 15: మండల కేంద్రం లింగంపేట నుంచి జిల్లా కేంద్రం కామారెడ్డికి బస్సులు సమయానికి రాకపోవడంతో ప్రయాణికులకు తిప్పలు తప్పడం లేదు. కామారెడ్డి డిపోనకు ప్రధాన ఆదాయ వనరుగా ఉన్న నిజాంసాగర్ రూట్లో బస్సులు సమయానికి రావడం లేదని ప్రయాణికులు వాపోతున్నారు. ఆర్టీసీ సమయపాలన పాటించకపోవడంతో కాలేజీ, పాఠశాల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉదయం వేళ సకాలంలో బస్సులు రాకపోవడంతో విద్యాసంస్థలకు సమయానికి చేరుకోవడం లేదని, దీంతో ఉపాధ్యాయులు తమను ఆరు బయట నిలబెడుతున్నారని వాపోతున్నారు. బస్సులు సమయానుసారం నడిపించాలని కోరుతూ నెల రోజుల క్రితం గాంధీనగర్ గ్రామంలో విద్యార్థులు కామారెడ్డి - ఎల్లారెడ్డి ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. ఆయనప్పటికీ అధికారుల్లో మార్పు రాలేదు. లింగంపేట నుంచి కామారెడ్డికి ఉదయం 6 గంటలకు బస్సు వెళ్తుందని ప్రయాణికులు తెలిపారు. అనంతరం ఉదయం 8 గంటల వరకు కామారెడ్డికి బస్సు సౌకర్యం లేదు. రెండు గంటల పాటు బస్సులు లేకపోవడంతో ప్రజలు ప్రైవేటు వాహనాలను ఆశ్రయిస్తున్నారు. సాయంత్రం కూడా కామారెడ్డి నుంచి లింగంపేటకు బస్సు సౌకర్యం సరిగా లేదని ప్రయాణికులు అంటున్నారు. గతంలో కామారెడ్డి నుంచి లింగంపేటకు లోకల్ బస్సు నడిపే వారు. ఆ సమయంలో ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బంది కలుగలేదు. ఆర్టీసీ అధికారులు స్పందించి సమయానికి బస్సులు నడిపి ఇబ్బందులు తీర్చాలని కోరుతున్నారు.




### విద్యార్థులకు ఇబ్బందులు

## చురుకుగా కొనసాగుతున్న అభివృద్ధి పనులు

లింగంపేట, డిసెంబర్ 15: లింగంపేట మండల కేంద్రంలోని మత్తడి పోచమ్మ ఆలయ పరిసరాల్లో అభివృద్ధి పనులు చురుకుగా కొనసాగుతున్నాయి. ఆలయ కమిటీ సభ్యులు విరాళాలు సేకరించి మత్తడి పోచమ్మ మందిర పరిసరాల్లోని వ్యవసాయ భూమిని కొనుగోలు చేశారు. వ్యవసాయ భూమిలోని రాళ్లను తొలగించి చదును చేయిస్తున్నారు. బండలతో పాటు చెట్లు, ముళ్ల పొదలు, పిచ్చి మొక్కలు తొలగించి పరిసరాలను శుభ్రం చేయిస్తున్నారు. భక్తుల సౌకర్యార్థం వసతులు కల్పించనున్నట్లు ఆలయ కమిటీ బాధ్యులు తెలిపారు. ఆలయానికి మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన భక్తులతో పాటు ఎల్లారెడ్డి, కామారెడ్డి, మెదక్, హైదరాబాద్, మహారాష్ట్ర తదితర ప్రాంతాల నుంచి వస్తుంటారు. ఆలయం వద్ద ప్రతి సంవత్సరం ఉగాది పండుగ సందర్భంగా వారం రోజుల పాటు ఉత్సవాలు నిర్వహిస్తుంటారు. ఉగాది పర్వదినం వరకు ఆలయం వద్ద ఏర్పాట్లు పూర్తి చేయనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు వెల్లడించారు.



భూమిని చదును చేస్తున్న పొక్లెయిన్

## అపరిశుభ్రం.. అస్తవ్యస్తం

### ప్రభుత్వ కార్యాలయాల వద్ద పిచ్చిమొక్కలు

మాచారెడ్డి, డిసెంబర్ 15: గ్రామాల్లో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని కిందిస్థాయి ఉద్యోగులకు చెప్పే అధికారులు.. తమ కార్యాలయాల ఆవరణ ఎలా ఉన్నా పట్టించుకోవడం లేదు. మండల పరిషత్, తహసీల్ కార్యాలయాల ఆవరణాలు చెత్తాచెదారం, పిచ్చిమొక్కలతో నిండిపోయాయి. మండల ప్రజలు ఏదైనా పని నిమిత్తం అటు వైపు వెళ్లి పరిసరాలను చూసి అసహనం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ కార్యాలయాల ఆవరణ ఉన్నాయి ఏంటని ముక్కున వేలు వేసుకుంటున్నారు. కింది స్థాయి అధికారులకు ఆదేశాలు జారీ చేయడమే కానీ మండల కార్యాలయాల చుట్టూ చెత్తాచెదారం ఉంటే ఏం చేయాలో పై స్థాయి అధికారులకు తెలియకుంటే ఎలా అని మండల ప్రజలు చర్చించుకుంటున్నారు.



మాచారెడ్డి తహసీల్ కార్యాలయ ఆవరణలో పెరిగిన పిచ్చిమొక్కలు

మాచారెడ్డి ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో

## వెలగని సెంట్రల్ లైటింగ్ బల్బులు

గాంధారి, డిసెంబర్ 15: మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై సెంట్రల్ లైటింగ్ బల్బులు సగానికి పైగా వెలగడంలేదు. మండల కేంద్రంలో కామారెడ్డి - బాన్సువాడ ప్రధాన రహదారి మధ్యలో స్థానిక వాగుపై ఉన్న వంతెన నుంచి ప్రభుత్వ దవాఖాన వరకు సెంట్రల్ లైటింగ్ ఏర్పాటుచేశారు. కొన్ని రోజులుగా సెంట్రల్ లైటింగ్ స్తంభాల బల్బులు సరిగా వెలుగడం లేదు. దీంతో రాత్రి సమయంలో పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.



## ఆరోగ్యం బాగాలేక ఉరేసుకుని యువతి ఆత్మహత్య



మంజుల(ఫైల్)

లింగంపేట(తాడ్వాయి), డిసెంబర్15: తాడ్వాయి మండలంలోని చిట్యాల గ్రామానికి చెందిన ఏర్పుల మంజుల (26) ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నదని ఎస్సై వెంకటేశ్వర్లు ఆదివారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. కామారెడ్డి పట్టణంలోని ప్రైవేటు దవాఖానలో నర్సుగా పని చేస్తున్న మంజుల కొంత కాలంగా పంటి, కడుపు నొప్పితో బాధపడుతున్నది. చికిత్స చేయించుకున్నా సమస్యలు తగ్గలేదు. దీంతో శనివారం కుటుంబ సభ్యులు వ్యవసాయ పనులకు వెళ్లగా.. మంజుల ఇంట్లో దూలానికి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నది. కుటుంబ సభ్యులు సాయంత్రం ఇంటికి వచ్చి గమనించి, పోలీసులకు సమాచారం అందించారు. మృతురాలి తండ్రి కాశయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ప్రభుత్వ దవాఖానకు తరలించామన్నారు.

## అనారోగ్యంతో రైతు..

రామారెడ్డి, డిసెంబర్ 15: అనారోగ్యంతో రైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలో ఆదివారం చోటుచేసుకున్నది. రామారెడ్డి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కన్నాపూర్ గ్రామానికి చెందిన పురిమిశెట్టి స్వామి(38) కొన్ని రోజుల క్రితం అనారోగ్యంతో బాధపడుతున్నాడు. దీంతో మనస్తాపం చెందిన అతడు.. సొంత వ్యవసాయ భూమిలో చెట్టుకు ఉరేసుకొని ఆదివారం ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య వరలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై నరేశ్ తెలిపారు.

## మతిస్థిమితం లేని మహిళ మృతి

నిజాంసాగర్, డిసెంబర్ 15: నిజాంసాగర్ పోలిస్‌స్టేషన్ పరిధిలోని బంజపల్లి గ్రామంలో మతిస్థిమితం లేని ఒక మహిళ మృతి చెందిన ఘటన ఆదివారం చోటు చేసుకున్నది.ఎస్సై శివకుమార్, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బంజపల్లి గ్రామానికి చెందిన కుర్మ భూమవ్వ(70) డిసెంబర్ 10వ తేదీన ఇంట్లో నుంచి వెళ్లింది. కుటుంబ సభ్యులు వెతికినా.. ఆచూకీ లభించలేదు. బంజపల్లి శివారులోని పెద్దపూల్ రోడ్డు పక్కన ఆదివారం ఆమె మృతదేహం కనిపించింది. కాలకృత్యాలు తీర్చుకోవడానికి వెళ్లి.. ప్రమాదవశాత్తు పడి మృతిచెంది ఉంటుందని కుటుంబీకులు తెలిపారు. మృతురాలి కొడుకు సాయిలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

## తల్లీకూతురు అదృశ్యం

కామారెడ్డి, డిసెంబర్ 15: తల్లీకూతురు అదృశ్యమైన ఘటన కామారెడ్డి పట్టణంలో చోటుచేసుకున్నది. పట్టణ సీఐ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని భవానీరోడ్‌లో నివసించే చాట్ల స్వరూపకు ఆరేండ్ల క్రితం వివాహం కాగా ఒక కుమార్తె ఉన్నది. భార్యాభర్తల మధ్య గొడవ జరిగింది. దీంతో ఆమె తల్లిదండ్రులతో కలిసి ఉంటున్నది. ఈనెల 4వ తేదీన స్వరూప తన నాలుగేండ్ల కూతురుతో కలిసి ఇంట్లో నుంచి వెళ్లింది. కుటుంబీకులు వెతికినా.. ఆచూకీ లభించలేదు. దీంతో స్వరూప తల్లి సిద్ధవ్వ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు కామారెడ్డి పట్టణ పోలీస్‌స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని సూచించారు.

## టేకు దుంగలు స్వాధీనం



అటవీశాఖ అధికారులు పట్టుకున్న టేకు దుంగలు

ఎల్లారెడ్డి రూరల్, డిసెంబర్ 15: మండలంలోని వెల్లుట్ల గ్రామంలో ఇంట్లో నిల్వ ఉంచిన టేకు దుంగలను అటవీశాఖ అధికారులు పక్కా సమాచారం మేరకు శనివారం రాత్రి పట్టుకున్నారు. ఫారెస్ట్ డివిజనల్ ఆఫీసర్ రామకృష్ణ తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. వెల్లుట్ల గ్రామానికి చెందిన పైడాకుల నర్సింహులు ఇంట్లో అనుమతి లేకుండా టేకు దుంగలు నిల్వ ఉంచినట్లు ఫారెస్ట్ అధికారులకు సమాచారం అందింది. దీంతో సిబ్బంది గ్రామానికి వెళ్లి అతడి ఇంట్లో తనిఖీ చేపట్టారు. 27కోయని, 97 కోసిన టేకు దుంగలు లభించాయి. ఎలాంటి అనుమతి పత్రాలు లేకపోవడంతో వాటిని స్వాధీనం చేసుకొని, ఎల్లారెడ్డి అటవీశాఖ కార్యాలయానికి తరలించారు. నర్సింహులుపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎఫ్‌డీవో రామకృష్ణ తెలిపారు.

## సర్దార్ వల్లాభాయ్ పటేల్‌కు నివాళి



నివాళులర్పిస్తున్న బీసీ గురుకుల పాఠశాల విద్యార్థులు

నస్రుల్లాబాద్, డిసెంబర్ 15: బీర్కూర్‌లోని బీసీ గురుకుల పాఠశాలలో ఆదివారం సర్దార్ వల్లాభాయ్ పటేల్ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

PLOT FOR SALE

★ డిచ్‌పల్లి టు ఆర్మూర్ వెళ్లే మెయిన్ రోడ్ నుండి 50 మీటర్ల దూరంలో మార్కెట్ దగ్గర 24x76 = 202 Sq.yads. మరియు 34x27 = 102 Sq.yds. ప్లాట్లు అమ్మకానికి కలవు. Ph: 9396411685, 9493984827.

NT-327118

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

4 లైన్ల క్లాసిఫైడ్స్ 200/- మాత్రమే, ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

## ముదిరాజ్‌లను బీసీ 'ఏ'లోకి మార్చాలి

### ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షుడు బట్టు విఠల్



సమావేశంలో మాట్లాడుతున్న ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షుడు బట్టు విఠల్

నిజాంసాగర్, డిసెంబర్ 15: రాష్ట్రంలో ముదిరాజ్ కులస్తులు పెద్ద సంఖ్యలో ఉన్నారని, వారిని బీసీ 'ఏ'లోకి మార్చకుంటే ప్రభుత్వంపై యుద్ధం ప్రకటిస్తామని ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షుడు బట్టు విఠల్ అన్నారు. నిజాంసాగర్ మండలంలోని కొమలంచ గ్రామంలో నిర్మించిన ముదిరాజ్ సంఘ భవనాన్ని ఆయన ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసి సమావేశంలో మాట్లాడుతూ.. ముదిరాజ్ కులస్తులు గ్రామాల్లో పెద్దమ్మ ఆలయాలను తప్పకుండా నిర్మించుకోవాలని సూచించారు. రాజకీయాల్లో కూడా రాణించాలని, నోటుకు కాకుండా ఓటుకు ప్రాధాన్యత ఇచ్చి, తమ కులస్తులను ఎన్నికల్లో గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు తూర్పు రాజు, కోశాధికారి గొట్టం నర్సింహులు, ఉమ్మడి నిజాంసాగర్ మండల ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు సాదుల సత్యనారాయణ, ఆయా గ్రామాల కార్యవర్గ సభ్యులు, ముదిరాజ్ కులస్తులు పాల్గొన్నారు.

## గురుకుల బాట ఫలితమే మెస్‌చార్జీల పెంపు

### బీఆర్ఎస్ కామారెడ్డి పట్టణ యువజన విభాగం అధ్యక్షుడు చెలిమల భాను ప్రసాద్



మాట్లాడుతున్న బీఆర్ఎస్ యువజన విభాగం కామారెడ్డి పట్టణ అధ్యక్షుడు భానుప్రసాద్

కామారెడ్డి, డిసెంబర్ 15: బీఆర్ఎస్ గురుకుల బాట పోరాట ఫలితమే మెస్ చార్జీల పెంపు అని బీఆర్ఎస్ పట్టణ యువజన విభాగం అధ్యక్షుడు చెలిమల భాను ప్రసాద్ అన్నారు. జిల్లాకేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా వసతి గృహాలు, గురుకులాలు, కేజీబీవీల్లో సమస్యలను తెలుసుకునేందుకు బీఆర్ఎస్ పార్టీ గురుకుల బాట చేపట్టిందని తెలిపారు. దీంతో ప్రభుత్వం దిగివచ్చి మెస్ చార్జీలను పెంచిందని చెప్పారు. కాంగ్రెస్ ఏడాది పాలనలో గురుకుల పాఠశాలల విద్యార్థులు ఫుడ్ పాయిజన్‌తో దవాఖానల్లో చేరుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. కానీ బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సీఎం కేసీఆర్.. గురుకులాల్లోని విద్యార్థులు ఎవరెస్ట్ శిఖరం ఎక్కే శక్తి సామర్థ్యాలను అందించేలా కృషి చేశారని చెప్పారు. గురుకుల విద్యార్థులకు అన్ని వసతులు కల్పించాలని ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విలేకరుల సమావేశంలో నాయకులు రాజేశ్, మసూద్, శ్రీను, గఫర్, సాయి తదితరులు పాల్గొన్నారు.